క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

కమలాపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ఉదయం 6 గంటల నుంచే సచివాలయ ఉద్యోగులు సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 6,983 మంది లబ్ధిదారులకు రూ.2,97,97,000 ను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఇప్పటికే సచివాలయ ఉద్యోగులు బ్యాంకుల నుంచి డబ్బు డ్రా చేశారని ఆమె అందులో తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం (చెన్నూరు) : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. చెన్నూరు మండలం కొండపేట పంచాయతీలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో చెన్నూరు మండల వైసీపీ కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, చెన్నూరు మండలాధ్యక్షుడు చీర్ల సురేష్‌యాదవ్, ఉప్పరపల్లె ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి, కొండపేట ఎంపీటీసీ నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, శ్రీను, మీసాల నాగిరెడ్డి, చెన్నూరు మైనార్టీ నాయకుడు హజరత్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవలు ప్రశంసనీయం

కమలాపురం : కమలాపురం జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో సోషియల్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన వెంకటలక్ష్మీ సేవలు ప్రశంసనీయం అని ఎంఈఓలు బేబి, సుభాషిణి కొనియాడారు. శనివారం వెంకటలక్ష్మీ దంపతులను వారు ఘనంగా సత్కరించారు.

అవయవదానం గొప్పవరం

పులివెందుల టౌన్ : మరణంలోనూ జీవిస్తున్న అవయవదాత, జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణకిషోర్ నేటి తరానికి ఆదర్శప్రాయులని ప్రధానోపాధ్యాయులు బండి సుధాకర్‌రెడ్డి కొనియాడారు. బుధవారం ఇస్లాంపురం పులివెందుల జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో కృష్ణకిషోర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ సమాచార కార్యదర్శి సనావుల్లా ఆధ్వర్యంలో కృష్ణకిషోర్ ప్రథమ వర్ధంతి సంస్మరణ సభను ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయండి

పులివెందుల రూరల్ : ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని సీడీపీఓ శ్రీలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా 7 రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల గురించి తల్లులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

వ్యాధి నివారణ టీకాలు

పెద్దముడియం : పశువులకు సోకే లంపీ, ముద్ద చర్మ వ్యాధులను నివారించేందుకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పెద్దముడియం పశువైద్యాధికారి భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలో మొత్తం 1100 తెల్ల పశువులు ఉండగా దాదాపు 600 పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. ఆగస్టు 15 వరకు పశువులకు టీకాలు అందించడం జరుగుతుందన్నారు.

పరిశుభ్రత పాటించాలి

కమలాపురం : పట్టణ పరిధిలోని ప్రజలందరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగర కమిషనర్ రాముడు తెలిపారు. బుధవారం పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. రోడ్లపై చెత్తా చెదారం ఊడ్పించడం, అలాగే డ్రైనేజ్‌లో నిల్వ ఉన్న పూడికను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

నేడు మండల సమావేశం

పెద్దముడియం : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనరసింహ్మ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. అలాగే ప్రజాప్ర తినిధులు తప్పక హాజరు కావా లని తెలిపారు.

పదవీ విరమణ తప్పనిసరి

వేంపల్లె : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ గురు ప్రభాకర్, సబ్ డీఎఫ్ఓ స్వామి వివేకానందలు తెలిపారు. బుధవారం స్థానిక ఫారెస్ట్ కార్యాలయంలో రసూల్ పదవి విరమణ సభలో వారు పాల్గొని మాట్లాడారు.

యువతకు ఉపాధి కల్పించాలి

పులివెందుల రూరల్ : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని పీఆర్ ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ శంకర్ ఆధ్వర్యంలో ఆర్డీఓ వెంకటేశులుకు వినతిపత్రం అందజేశారు. దీనికి ఆర్డీఓ స్పందిస్తూ ఉక్కు పరిశ్రమ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ!

- రూ.32 కోట్లతో హై లెవెల్ వంతెన నిర్మాణం
- తీరిన మూడు గ్రామాల కష్టాలు
- వైఎస్సార్‌ను స్మరించుకుంటున్న గ్రామాల ప్రజలు
- హై లెవెల్ బ్రిడ్జిని లోడు టెస్టింగ్ చేసిన అధికారులు
- ప్రారంభానికి సిద్ధంగా ఉన్న హై లెవెల్ బ్రిడ్జి



పాపాఘ్ని నదిపై నిర్మించిన హై లెవెల్ బ్రిడ్జి

వేంపల్లె : మండలంలోని అలిరెడ్డిపల్లె, దిగువతువ్వపల్లె, ఎగువతువ్వపల్లె గ్రామ ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. ఆ గ్రామాలకు హై లెవెల్ వంతెన లేక ఎన్నో ఏళ్లుగా ప్రజలు అష్ట కష్టాలు పడ్డారు. వర్షాకాలంలో నది అవతల ఉన్న గ్రామాలకు, పొలాలకు వెళ్లాలంటే ప్రజలు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాకాలంలో రాత్రి వేళల్లో వరద నీరు వచ్చి ఉధృతితో కొట్టుకుపోయే ప్రమాదం ఉండేది. మూడు గ్రామాలలో మొత్తం 1500 కుటుంబాలు ఉన్నాయి. విద్యార్థులు బడికి రావాలన్నా.. నిత్యవసర వస్తువులు తీసుకోవాలన్న, రెవెన్యూ పనులు చేయించుకోవాలన్నా మండల కేంద్రానికి వేంపల్లికి రావాల్సిందే. పాపాఘ్ని నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తే చుట్టూ 25 కిలోమీటర్లు తిరుగుకుని రావాల్సివస్తోంది. ఇలాంటి నేపథ్యంలో ఆ గ్రామాల ప్రజలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. అప్పట్లో ఆయన నిధులు మంజూరు చేసి టెండర్లు పిలవగా ఎవరు ముందుకు రాలేదు. వైఎస్సార్ మరణాంతరం తర్వాత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. అనంతరం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి చొరవ తీసుకుని 2017లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.32 కోట్లు నిధులు మంజూరు అయ్యేలా కృషి చేశారు. 2018 అక్టోబర్‌లో హైదరాబాదుకు చెందిన ఆర్‌ఎస్‌వి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పనులను ప్రారంభించింది. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడంతో ఆ గ్రామాల ప్రజలు, రైతుల సాకారం అయ్యింది. అధికారులు హై లెవెల్ బ్రిడ్జిని ఇప్పటికే లోడు టెస్టింగ్ చేశారు. పనులు దాదాపు పూర్తి కాగా ప్రస్తుతం మైనర్ పనులు ఉన్నాయి. అవి పూర్తయిన వెంటనే బ్రిడ్జిని ప్రారంభించనున్నారు. హై లెవెల్ బ్రిడ్జి పూర్తి కావడంతో ఆ మూడు గ్రామాల ప్రజలు వైఎస్సార్ ను స్మరించుకుంటున్నారు.



రాకపోకలకు సిద్ధంగా ఉన్న బ్రిడ్జి



బ్రిడ్జి ఏర్పాటు చేయకమునుపు పాపాఘ్ని నది మీదుగా వస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు(ఫైల్)

మట్టి రోడ్డునే రహదారిగా మార్చుకుని..

ఆ మూడు గ్రామాల ప్రజలు పాపాఘ్ని నదిలో మట్టి రోడ్డునే రహదారిగా మార్చుకుని వేంపల్లి కు రాకపోకలు సాగించారు. ఎవరికైనా ప్రాణాపాయ స్థితిలో 108కు ఫోన్ చేసిన 'క్షమించండి'మీ ఊరికి రోడ్డు సరిగా లేదు 108 వాహనం రాదు అని నిర్మోహమాటంగా చెప్పేవారు. గతంలో ఆ గ్రామాల్లోని మహిళ నిండు గర్భవతిని 108 వాహనంలో తీసుకొస్తుండగా అదుపుతప్పి పాపాఘ్ని నదిలో వాహనం బోల్తా పడింది. అదృష్టం బాగుండి ఎవరికి ఏ ప్రమాదం జరగలేదు. వైద్య ఆరోగ్య సిబ్బంది అక్కడికే వచ్చి ఆ మహిళకు ప్రసవం చేసిన ఘటనలు ఉన్నాయి.

హైలెవెల్ వంతెన పరిశీలన



హైలెవెల్ వంతెనను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది మీదుగా వేంపల్లె–అలిరెడ్డిపల్లె మార్గమధ్యలో రూ.32.96 కోట్ల వ్యయంతో నిర్మించిన హైలెవెల్ వంతెనను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలించారు. బుధవారం కడప క్వాలిటీ కంట్రోల్ ఈఈ సూర్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు వంతెన నాణ్యతను తనిఖీ చేశారు. ఇసుక లారీలను హైలెవెల్ వంతెన పైన ఉంచి నాణ్యతను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా అలిరెడ్డిపల్లె, తువ్వపల్లె గ్రామ ప్రజలు వంతెన లేక వర్షాలు పడినప్పుడు చాలా ఇబ్బందులు పడేవారు. కార్యక్రమంలో డీఈఈలు గురివిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఏఈఈలు గణేశ్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, మునిరెడ్డి, నాగేంద్ర, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ చొరవతోనే హై లెవెల్ వంతెన పూర్తి



కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మా మూడు గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించి హై లెవెల్ వంతెన కోసం కృషి చేసినందుకు కృతజ్ఞతలు. బ్రిడ్జి నిర్మాణం ఎన్నో ఏళ్ల కల కాగా నెరవేరే రోజు వచ్చింది. గతంలో నదిలో మట్టి రోడ్డు పైనే రాకపోకలు సాగించే వారం. నది ప్రవాహం ఉధృతంగా ప్రవహించినప్పుడు తాత్కాలిక మట్టిరోడ్డు కొట్టుకుని పోయేది. మరలా ప్రవాహం తగ్గినంతవరకు చుట్టూ 25 కిలోమీటర్ల మేర తిరుగుకొని వచ్చేవారం. బ్రిడ్జి నిర్మించటంతో ప్రజల రాకపోకలు సాఫీగా సాగనున్నాయి.

– వి. చంద్రశేఖర్‌రెడ్డి, అలిరెడ్డిపల్లె గ్రామం, వేంపల్లి

రాకపోకల కష్టాలు తీరినట్టే



వేంపల్లి పాపాఘ్ని నదిలో హై లెవెల్ బ్రిడ్జిని నిర్మించడంతో ప్రజల రైతుల కష్టాలు తీరినట్టే. గతంలో వర్షాకాలంలో నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడు విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు ఇతర ప్రయాణికులు చుట్టూ 25 కిలోమీటర్ల మేర తిరుగుకొని వెళ్లేవారం. అంతేకాకుండా బ్రిడ్జితో పాటు సైడ్ వాల్ నిర్మించడంతో ఎన్ని నీళ్లు వచ్చిన ఊర్లోకి రావు. నదిలో హై లెవెల్ బ్రిడ్జి రావడానికి వైఎస్సార్ బీజం వేశారు. ఆయనను ఎన్నటికీ మరువలేం.

– వి.వెంకటనారాయణరెడ్డి, ఎగువతువ్వపల్లె, వేంపల్లి

త్వరలో ప్రారంభోత్సవం ఉంటుంది



పాపాఘ్ని నదిలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం దాదాపు పూర్తయింది. ఇతర చిన్న చిన్న మైనర్ పనులు కూడా పూర్తి చేసి త్వరలోనే ప్రారంభిస్తాం. కరోనా పరిస్థితులు వర్షాలు వరదలు రావడంతో సకాలంలో పనులు పూర్తి చేయలేకపోయాం. నాణ్యత ప్రమాణాలు పాటించి హై లెవెల్ బ్రిడ్జిని నిర్మించాం. బ్రిడ్జి నిర్మాణంతో మూడు గ్రామాల ప్రజలు రైతుల కష్టాలు నుంచి గట్టెక్కడం ఆనందంగా ఉంది.

– సుధాకర్‌రెడ్డి, డీఈ పంచాయతీరాజ్, పులివెందుల

సస్యరక్షణ చర్యలు పాటించండి



పుట్లంపల్లె వద్ద ఎండుతున్న వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కమలాపురం : ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటలు మూడు రోజులకే ఎండిపోయే లక్షణాలు కనిపిస్తున్నాయని, వాటికి సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఊటుకూరు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. బుధవారం మండలంలోని పుట్లంపల్లె, మీరాపురం, సంబటూరు గ్రామాలలో ఎండు దశలో ఉన్న వరి పైర్లను వారు పరిశీలించారు. నారుమళ్లు, ప్రధాన పొలాల్లో రైతులు కేఎన్ఎం 1638, 733 రకాలను సాగు చేశారు. నారు నాటిన 3వ రోజు నుంచే పైరు ఎండిపోయి మాడు లక్షణాలు కనిపిస్తుండటంతో వారు ఆయా పొలాల్లోని నీరు, మట్టిని సేకరించారు. ఊటుకూరు పరిశోధనా కేంద్రంలో వాటిని విశ్లేషించగా లవణ శాతం 3 నుంచి 10 డిఎస్ఎం 1గా ఉన్నాయని నిర్ధారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణంగా లవణ శాతం 2 కన్నా తక్కువగా ఉన్నపుడు మాత్రమే పెరుగుదల మొక్కలలో ఉంటుందన్నారు. దీని నివారణకు పాలీఫీడ్ (19–19–19) 5 గ్రాములు, 0.2 గ్రాములు చిలేటేడ్ జింక్ సల్ఫేట్ కలిపి నాటిన 3 రోజుల నుంచి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. అలాగే సంబటూరులో పూత దశలో ఉన్న మినుము పంటను పరిశీలించారు. మినుము పంటకు ఆకు ముడత లక్షణాలు కనిపిస్తున్నాయని, దీని నివారణకుగాను డైఫన్ థయురాన్ 1.25 గ్రాములు, 13–0–45ను 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని శాస్త్రవేత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో ఊటుకూరు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు ఎం.శ్రీనివాసాచారి, కె.సునీల్, వి.మాధవి, కేవీకే సమన్వయకర్త ఏ.వీరయ్య, ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, రైతు సంఘం నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వందేళ్ల సమస్యకు పరిష్కారం



ష్మశాన వాటికలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

లింగాల : మండలంలోని బోనాల గ్రామం స్మశాన వాటిక సమస్య వందేళ్లుగా పరిష్కారం కాలేదు. అలాంటి సమస్యకు నేడు పరిష్కారం లభించింది. సర్వే నెం.207/1, 207/2సి అనే భూమిలో 0.60 సెంట్లు ఉన్న స్మశాన వాటిక ఆక్రమణలకు గురైంది. దీంతో డిప్యూటీ తహసీల్దార్ త్రిభువన్‌రెడ్డి గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించారు. బుధవారం డిప్యూటీ తహసీల్దార్, సర్వేయర్ పార్వతి, ఆర్ఐ సురేంద్రలు సంఘటనా స్థలానికి వెళ్లి సమస్యను పరిష్కరించారు. ఆ స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. స్థలాన్ని ఎవరైనా ఆక్రమణకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న కృష్ణమూర్తి

వేంపల్లె : సేంద్రియ, జీవన ఎరువులు వాడకం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని నవభారత్ ఫర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం మండలంలోని నందిపల్లె, కత్తలూరు గ్రామాల్లో ర్యాలీ చేసి రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి మాట్లాడారు. పంట సాగులో రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయన్నారు. రసాయన ఎరువుల వాడకం వల్ల క్రమక్రమంగా భూమిలో భూసారం తగ్గిపోయి పంట దిగుబడులు తగ్గిపోవడమే కాకుండా మానవ, జంతువాలికి ముప్పు కలిగిస్తాయన్నారు. సేంద్రియ జీవన ఎరువులు పంటలకు భూమిలోని మిత్ర పురుగులైనటువంటి సూక్ష్మజీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావాల్సిన పోషకాలను అందించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సురేష్, రంగప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఉమ్మడి వనరుల పరిరక్షణ మనందరి బాధ్యత

తొండూరు : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఉమ్మడి వనరులను పరిరక్షించి వాటిని అభివృద్ధి పరచుకోవడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యతని జిల్లా క్లస్టర్ కోఆర్డినేటర్ లావణ్య తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామంలోని కొండలు, గుట్టలు, బంజరు భూములు, వాగులు, వంకలు, పచ్చిక బయలు, స్మశానవాటికలు, తదితర వాటిని గ్రామస్తులందరికి సమాన హక్కులు కల్పించేలాగ ఈ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఉమ్మడి వనరులు ఏ ఒక్కరి సొంతం కావని ఇవి ఊరందరి ఆస్తులని, వీటిని కాపాడుకునే బాధ్యత మనందరిదన్నారు. గ్రామీణ ప్రజలకు వంటచెరుకు, పశువులకు మేత, తేనె, ఎరువు, మందు మొక్కలు, పొరకలు మొదలైన వనరులన్నీ ఈ ఉమ్మడి వనరులన్నారు. కార్యక్రమంలో ఈసీ జనార్ధన్‌రెడ్డి, మండల ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికీ రక్తపరీక్ష చేయాలి



ల్యాబ్‌లోని రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

వేముల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని చాగలేరు గ్రామంలో ఉన్న ల్యాబ్‌ను జిల్లా మలేరియా అధికారి మనోరమ పరిశీలించి మాట్లాడారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోధకాలు, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు దోమకాటు వల్ల వస్తాయన్నారు. జూలై 1వ తేదీ నుంచి 31వరకు నిర్వహించిన డెంగీ వ్యతిరేక మాసోత్సవాలను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని గ్రామాల్లో నిర్వహించి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. కార్యక్రమంలో వేముల వైద్యాధికారి ఆఫ్రిన్, సబ్‌యూనిట్ అధికారి సిద్ధయ్య, సీహెచ్ఓ రెడ్డమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థానాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న ఎంఈవో విజయరెడ్డి

వల్లూరు : విద్యార్థులు క్రమ శిక్షణతో మంచి చదువులను చదివి ఉన్నత స్థానాలను అధిరోహించడానికి కృషి చేయాలని ఎంపీడీవో విజయభాస్కర్, ఎంఈవో విజయరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ కమ్ జూనియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీడీవో, ఎంఈవోలు మాట్లాడుతూ పాఠశాలలో అందుబాటులో వున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. పాఠశాల ప్రైమ్ మినిష్టర్ స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ)కి ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను, సౌకర్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి వారి తల్లికి గుర్తుగా ఒక మొక్కను నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడానికి తోడ్పాటునందించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్ స్ప్రేయర్‌పై రైతులకు అవగాహన



డ్రోన్ స్ప్రేయర్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

వేముల : పంటలకు సోకుతున్న తెగుళ్ల నివారణకు డ్రోన్ సహాయంతో మందుల పిచికారీపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేములలోని రైతు ఉత్పత్తిదారుల సంఘంలోని రైతులకు నాబార్డ్ సహకారంతో కడప సుస్థిర వ్యవసాయకేంద్రం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో పత్తిపంటలో వచ్చే పురుగు, తెగుళ్ల నివారణకు అవగాహన కల్పించారు. రైతులకు బయో ఫర్టిలైజర్ ద్వారా ఉచితంగా మూడు ఎకరాలలో డ్రోన్‌ను ఉపయోగించి మందుల పిచికారీపై డెమో నిర్వహించారు. 20 రోజులకు, 45 రోజులకు డ్రోన్, పవర్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయించి డ్రోన్ స్ప్రేయర్ వల్ల కలిగే ఉపయోగాలను ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ అంకయ్య, సీఎస్ఏ స్టేట్ కోఆర్డినేటర్ ఆదినారాయణలు రైతులకు వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగం కలుగుతుంది, అంతేకాక పవర్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయడం వల్ల పంటలకు పూర్తి స్థాయిలో మందు అందే పరిస్థితి ఉండదని, అదే డ్రోన్ స్ప్రేయర్ పిచికారీ చేయడం వల్ల ప్రతి ఒక్క మొక్కకు మందు అందుతుందన్నారు. రాబోయే రాజుల్లో డ్రోన్ స్ప్రేయర్ ప్రాధాన్యత ఉంటుందని, రైతులు ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మిత్ర భాస్కర్, రైతులు పాల్గొన్నారు.